క్లుప్తంగా

న్యుమోనియాపై అవగాహన కల్పించాలి



వీపనగండ్ల: గ్రామాల్లో న్యుమోనియా నివారణపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని మండల వైద్యాధికారి వంశీకృష్ణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లకు న్యుమోనియా నివారణపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఐదేళ్ల లోపు చిన్నారులపై సర్వే నిర్వహించి వ్యాధి తీవ్రతను గుర్తించాలని, అవసరమైన వారికి మందులను పంపిణీ చేయాలని సూచించారు.

అభివృద్ధికి కృషి చేయాలి



వనపర్తి: ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ చేనేత విభాగం ప్రధాన కార్యదర్శి గంజి శ్రీనివాసులు మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా గంజి శ్రీనివాసులు మాట్లాడుతూ వనపర్తి నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి కుకుడాల బాలకృష్ణ, అగ్గన్నగారి శివారెడ్డి, వావిళ్ల కోటేశ్వర్‌రెడ్డి, గంజి గోపాల్, జావీద్ఖాన్, ఉపేందర్‌వర్మ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



పాన్‌గల్: మండలంలోని దావాజిపల్లికి చెందిన ఇద్దరు యువకులు గడ్డం శివ, గడ్డం రాంబాబు రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలుసుకున్న రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మంగళవారం జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రి మార్చురీ వద్ద మృతదేహాలకు నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాద ఘటన వివరాలను మంత్రి తెలుసుకున్నారు. యువకుల మరణం తల్లిదండ్రులకు తీరని దుఃఖాన్ని మిగిల్చిందని వాపోయారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. డాక్టర్ రఘు, డాక్టర్ స్వప్న పాఠశాలలో కళ్లు, చెవులు తదితర సమస్యలతో బాధపడుతున్న విద్యార్థులకు పరీక్షలు చేశారు. మందులు అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఎక్కువ సమస్యలతో బాధపడుతున్న విద్యార్థులను గుర్తించి మహబూబ్‌నగర్ ఆస్పత్రికి సిఫార్స్ చేసినట్లు వైద్యులు తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీవిద్య, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీకి బారులు తీరిన మహిళలు

పెద్దకొత్తపల్లి: ఆరు గ్యారంటీలలో రూ.500లకే సిలిండర్ అందిస్తామని పథకం ఉండటంతో గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీకి కోసం బారులు తీరుతున్నారు. ఆధార్‌కార్డుకు ఫోన్ నంబర్ లింక్ కోసం ఈకేవైసీ చేయించుకోవడం కోసం గ్యాస్ ఏజెన్సీ వద్ద మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి క్యూలో నిల్చుంటున్నారు. మండలంలోని 28 గ్రామాలకు ఒకే ఏజెన్సీ ఉండడం వలన అన్ని గ్రామాల నుంచి మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. గంటల తరబడి గోదాంవద్ద క్యూలో నిలబడి నిరీక్షించక తప్పడం లేదు. ప్రభుత్వం ఈకేవైసీ నమోదు కోసం ప్రభుత్వం ఎలాంటి నిర్దిష్ట గడువు, ఎలాంటి విధివిధానాలు ప్రకటించకపోయినా వినియోగదారులు తెలిసి తెలియక గోదాంల వద్దకు పరుగులు తీస్తున్నారు.

అయోధ్య రాముడి అక్షింతల ఊరేగింపు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని మార్కండేయ దేవాలయం నుంచి శ్రీరామ దేవాలయం వరకు అయోధ్య శ్రీరాముడి అక్షింతలు, పాదుకలను విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వీహెచ్‌పీ నాయకులు లక్ష్మీకాంత్‌రెడ్డి, భీమేశ్‌రెడ్డి, శోభారాణి, రఘుపతిరెడ్డి, కృష్ణారెడ్డి, నాగరాజు గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లస్టర్ల పెంపు ఎన్నడో?

- రైతుల కష్టాలు తీరేందుకు పెంపు అవసరం
- సిబ్బందిపై పనిభారం
- క్లస్టర్ల పరిధిలోని గ్రామాలను మార్చాలంటూ వినతి



మంగళ్లపల్లిలో పంటలను పరిశీలిస్తున్న ఏఈఓ నరేష్(ఫైల్)

పాన్‌గల్: రైతులకు వ్యవసాయ రంగంలో సలహాలు, సూచనలు అందించేందుకు వీలుగా గతంలో ప్రభుత్వం క్లస్టర్ల వ్యవస్థను ఏర్పాటు చేసినప్పటికీ.. అదనపు క్లస్టర్ల విషయాన్ని పట్టించుకోవడం లేదు. విస్తీర్ణం, సాగవుతున్న భూమి రెవెన్యూ లెక్కల ఆధారంగా ఐదు వేల ఎకరాలకు ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి సహాయ వ్యవసాయ అధికారులను నియమించారు. రానురాను సాగు విస్తీర్ణం పెరగడంతో దానికి అనుగుణంగా సిబ్బందిని నియమించకపోవడంతో ప్రస్తుతం పనిచేస్తున్న సహాయ వ్యవసాయ అధికారులపై పనిభారం పెరిగింది. కొత్త లెక్కల ప్రకారం క్లస్టర్లను పెంచాలని వ్యవసాయ అధికారులు నివేదికలు పంపినా నేటికీ క్లస్టర్లు పెరగలేదు.

మండల పరిస్థితి

మండలంలోని 28 గ్రామ పంచాయతీల పరిధిలో ప్రస్తుతం 40 వేల ఎకరాలకు పైగా పంటలు సాగువుతుండగా వాటికి కేవలం 5 క్లస్టర్లు పాన్‌గల్, రేమద్దుల, దొండాయిపల్లి, కేతేపల్లి, మల్లాయిపల్లి క్లస్టర్లు ఉన్నాయి. వీటికి అదనంగా మూడు క్లస్టర్లు అవసరమని అధికారులు అంచనా వేశారు. మండలంలోని భీమా, కేఎల్ఐ కాల్వల ద్వారా రెండు పంటలకు నీరు అందుతుండటంతో సాగు అధికంగా పెరిగిందని అధికారులు చెబుతున్నారు.

సంక్షేమ పథకాలతో పనిభారం

క్లస్టర్ల వారీగా ఏఈఓలకు ఐదు వేల ఎకరాలు దాటి 8 నుంచి 10 వేల ఎకరాల వరకు పెరిగింది. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలు పెరగడంతో వాటిని వారికి చేరవేయాల్సిన బాధ్యత క్లస్టర్ల అధికారులపై ఉంది. పంట సాగు వివరాల నమోదు, రైతువేదికల ద్వారా అవగాహన కార్యక్రమాలు, క్షేత్ర స్థాయిలో పంటల సందర్శన, రైతుబంధు, రైతుబీమా, సమగ్ర సర్వేలు చేపట్టాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఏఈఓలు ఉదయమే తమ పరిధిలోని రైతువేదిక వద్ద సెల్ఫీ దిగి ట్యాబ్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

క్లస్టర్ల పరిధిలో గ్రామాలు అస్తవ్యస్తం

క్లస్టర్ల పరిధిలో ఉన్న గ్రామాల ఎంపిక అస్తవ్యస్తంగా ఉన్నాయి. క్లస్టర్ పరిధిలో దగ్గరలో ఉన్న రైతువేదికలో చేర్చకుండా పది నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న క్లస్టర్‌లో చేర్చడంతో ఆయా గ్రామాలకు వెళ్లేందుకు సరైన రవాణా వ్యవస్థ లేకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నివేదికలు పంపాం



రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలతో మండలంలో పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. దీనికి అనుగుణంగా అదనంగా క్లస్టర్ల ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి నివేదికలు పంపాం. ప్రస్తుతం ఉన్న ఐదు క్లస్టర్లకు అదనంగా మరో మూడు క్లస్టర్లు పెరిగితే ఏఈఓలకు పనిభారం తగ్గడంతో పాటు రైతులకు మేలు జరుగుతుంది.

– సాజీద్ ఉర్ రహమాన్, ఏఓ, పాన్‌గల్

కేతేపల్లి క్లస్టర్ పరిధిలోకి మార్చాలి



మా గ్రామ పంచాయతీని రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కేతేపల్లి రైతువేదిక క్లస్టర్‌లో కాకుండా 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న దొండాయిపల్లి క్లస్టర్ పరిధిలోకి చేర్చారు. రైతులకు సంబంధించిన ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించిన ఆ క్లస్టర్‌కు వెళ్లడం ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మా జీపీని దగ్గరలోని కేతేపల్లి క్లస్టర్ పరిధిలోకి మార్చాలి.

– అంజి, సర్పంచ్ మంగళ్లపల్లి

క్లస్టర్ల సంఖ్య పెంచాలి



మండలంలో ప్రస్తుతం ఉన్న ఐదు క్లస్టర్లకు అదనంగా మరో మూడు నిర్మించాలి. సాగవుతున్న భూమి విస్తీర్ణం ఎక్కువగా ఉండటం, దానికి అనుగుణంగా ఏఈఓలు లేకపోవడంతో రైతులకు ఇబ్బందిగా మారింది.

– బాల్యానాయక్, తెల్లరాళ్లపల్లితండా

ఓటర్ జాబితాలో తప్పులు ఉండొద్దు



వీపనగండ్ల: గ్రామాల్లో ఓటర్ లిస్టుల తయారీలో బూత్ లెవల్ అధికారులు అవసరమైన జాగ్రత్తలు తీసుకుని, తప్పులు దొర్లకుండా చూసుకోవాలని నయాబ్ తహసీల్దార్లు లక్ష్మీకాంత్, చక్రపాణి, శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఓటర్ లిస్టుల తయారీపై బీఎల్‌ఓలకు అవగాహన కల్పించారు. అర్హులైన యువతను నూతన ఓటర్లుగా నమోదు చేయడం, మరణించిన వారి పేర్లను, డబుల్ ఓటర్ల తొలగింపు లాంటి విషయంలో ఎలాంటి తప్పులు జరగకుండా సంబంధిత కుటుంబ సభ్యులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని వారు బీఎల్‌ఓలకు సూచించారు. ఓటర్ల నమోదులో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం కల్పించొద్దని ఆదేశించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కృష్ణమూర్తి, కృష్ణ, బీఎల్‌ఓలు సుగుణాబాయి, కృష్ణమ్మ, పారిజాత, లక్ష్మి, సువర్ణ, మహేశ్వరి, ఎల్లమ్మ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



మాట్లాడుతున్న తండా సర్పంచ్ శాంతమ్మ

పాన్‌గల్: గ్రామాభివృదద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని తెల్లరాళ్లపల్లితండా సర్పంచ్ శాంతమ్మ అన్నారు. మంగళవారం పంచాయతీ భవనం ఆవరణలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తండావాసులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడంలో తోడ్పాటునందించాలని కోరారు. పనిచేసే ప్రతి ఉపాధి కూలీకి పని కల్పించాలన్నారు. పంచాయతీలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు త్వరగా చెల్లించాలని, ముఖ్యంగా పంచాయతీ భవనం బిల్లు మంజూరు చేయాలన్నారు. తండాలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఉప సర్పంచ్ బొజ్జమ్మ, పంచాయతీ కార్యదర్శి నర్మద, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ సునీత, ఏఎన్ఎం సరళ, ఫీల్డు అసిస్టెంట్ సోమ్లా, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, మహిళ సమాఖ్య సభ్యులు, తండావాసులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న నాగరాజ్‌గౌడ్

అమరచింత: మక్తల్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధి కోసం ప్రజలందరూ కలిసిమెలసి ముందుకు రావాలని టీపీసీసీ గీత కార్మిక రాష్ట్ర చైర్మన్ నాగరాజ్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం మండల స్థాయి కాంగ్రెస్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో పల్లెలు అభివృద్ధికి నోచుకోలేదని వాపోయారు. మండలంలోని పలు గ్రామాలకు నేటికీ కచ్చ రహదారులే ఉన్నాయని, వీటిని త్వరలోనే బీటీలుగా మార్చుకునేందుకు ప్రతిపాదనలను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో కలిసి సిద్ధం చేస్తున్నామన్నారు. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టులో ప్రస్తుత నీటి మట్టం వివరాలను పూర్తి స్థాయిలో పరిగణలోకి తీసుకుని యాసంగిలో రైతులకు సాగునీరు వదలాల.. వద్దా అన్న విషయాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి నిర్ణయం తీసుకుంటున్నామని తెలిపారు. ఆత్మకూర్ మండలంలోని డీ6 కాల్వల మరమ్మతుతో పాటు చివరి గ్రామమైన రేచింతల వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల వ్యవహారంలో నిజమైన లబ్ధిదారులను గుర్తించి వారికే లబ్ధి చేకూరేలా స్థానికంగా గ్రామ సభలు నిర్వహించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్, మండల, పట్టణ కార్యదర్శి మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, మహంకాళి విష్ణు, పురం వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని వినతి



డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

కొత్తకోట రూరల్: మండలంలోని వడ్డెవాట, చర్లపల్లి గ్రామాలకు నడుస్తున్న ఆర్టీసీ బస్సును మూడేళ్ల క్రితం అధికారులు రద్దు చేశారు. రోడ్డు సౌకర్యం సరిగ్గా ఉన్నప్పటికీ గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ఇరు గ్రామాల ప్రజలు గతంలో ప్రజాప్రతినిధులకు, ఆర్టీసీ అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. మూడేళ్ల క్రితం రోజుకు ఆరు ట్రిప్పులు బస్సు నడిచేదని, మళ్లీ బస్సును పునరుద్ధరించాలని గ్రామస్తులు మంగళవారం వనపర్తి డిపో మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రెండు గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలు మాత్రమే ఉన్నాయని, బస్సు రద్దు కావడంతో వడ్డెవాట, చర్లపల్లి గ్రామాలతో పాటు వడ్డెవాటతండా, సత్యహళ్లి గ్రామాలకు సంబంధించిన విద్యార్థులు ఉన్నత విద్య కోసం కొత్తకోట, వనపర్తి, మహబూబ్‌నగర్‌కు వెళ్లి చదువుకోవాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వాపోయారు. అంతేకాకుండా కొందరు విద్యార్థులు బస్సు సౌకర్యం లేకపోవడంతో చదువుకు దూరమవుతున్నారని, ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని ఆర్టీసీ బస్సును గతంలో మాదిరిగానే నడపాలని వినతిపత్రంలో కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో లక్ష్మీకాంత్‌రెడ్డి, రవీందర్‌నాయుడు, రాజేష్, శంకర్‌బాబు, శ్రీనివాసులు, బాలకృష్ణ, నాగరాజుగౌడ్, రాఘవేంద్ర, వడ్ల శివశంకర్, రాంచంద్రయ్యగౌడ్, పరుశరాములు, గొల్ల వెంకటయ్య తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



ఆత్మకూర్: పేదరిక నిర్మూలన కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, వ్యవసాయాధికారి వినయ్‌కుమార్, ఎస్బీఐ బ్రాంచ్ మేనేజర్ అబ్బాస్‌అలీ అన్నారు. మంగళవారం మండలంలోని తూంపల్లి, కత్తేపల్లి గ్రామాల్లో వికాసిత్ సంకల్ప్‌యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామాల్లో జన్‌ధన్, సురక్ష, కిసాన్‌సమ్మాన్‌యోజన, అటల్‌పెన్షన్, ఆయుష్మాన్ భారత్ తదితర పథకాల గురించి ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా అవగాహన కల్పించారు. డ్రోన్ ద్వారా అత్యాధునిక వ్యవసాయం గురించి క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు లక్ష్మీకాంత్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

పెబ్బేరు రూరల్: పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్, రాంకీ ఫౌండేషన్ సంయుక్తంగా స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి అవసరమైన శిక్షణను ఉచితంగా ఇవ్వనున్నట్లు పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ గద్దె భాస్కర్ తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులై 18 నుంచి 23 ఏళ్లలోపు ఓసీ అభ్యర్థులు, 26 ఏళ్లలోపు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ అభ్యర్థులు శిక్షణ పొందేందుకు అర్హులన్నారు. ఈ నెల 23న వనపర్తి, మరికల్, నారాయణపేట, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ గుంటూరు జిల్లాలోని తుళ్లూరు మండలం పెద్దపరిమిలో అర్హత పరీక్ష ఉంటుందని.. 24న ఫలితాలు ప్రకటిస్తామని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు 25న తెలంగాణలోని ములుగు మండలం ఒంటిమామిడి, ఆంధ్రప్రదేశ్‌లోని పెద్దపరిమిలో రిపోర్టు చేయాలని కోరారు. శిక్షణతో పాటు ఉచిత వసతి, భోజనం, స్టడీ మెటీరియల్ ఉచితంగా అందజేస్తారని వివరించారు. దరఖాస్తుకు ఈ నెల 21 చివరి గడువని.. ఆసక్తి గల అభ్యర్థులు టీటీటీ. ఇ్టట ౖఛ్రిట్ట ఔటజ లేదా ఇ్టట్పౖఛ్రిట్ట ఽఛిట్ఛ్ఛ జీఞ్ఛ జౌ ఠిఛ్ఛిజీౌ ఽ జ్చఛ్ఛి ఫౌజు ఇ్టజ్చ వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు సెల్‌ఫోన్ నంబర్లు 99480 05116, 97919 73794 సంప్రదించాలని పేర్కొన్నారు.

రామాలయంలో పూజలు

కొల్లాపూర్: పట్టణంలోని రామాలయంలో ధనుర్మాసం పురస్కరించుకొని మంగళవారం గోదాదేవి, రంగనాథస్వామిలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవతామూర్తులకు తిరుప్పావై సేవలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు అందజేశారు. పూజా తదితర కైంకర్యాలను ఆలయ భక్త బృంద కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

అవినీతిపై చర్చకు సిద్ధమా..?



మాట్లాడుతున్న చీర్ల విజయ్‌చందర్

వనపర్తి టౌన్: మున్సిపాలిటీలో జరిగిన, జరుగుతున్న అవినీతిపై చర్చకు మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్ సిద్ధమా అని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయ్‌చందర్ సవాల్ విసిరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తేదీ, స్థలం మున్సిపల్ చైర్మన్ నిర్ణయిస్తే బహిరంగంగా, మీడియా సమక్షంలో ఆధారాలతో అవినీతిని నిరూపిస్తామన్నారు. అవినీతిని నిరూపిస్తే రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నారా అని సూటిగా ప్రశ్నించారు. మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతిపై విజిలెన్స్, న్యాయ విచారణ జరిపించేందుకు కాంగ్రెస్ పార్టీ సన్నద్ధం అవుతుందని, చైర్మన్ పదవిని నుంచి గట్టుయాదవ్‌ను దించకుండానే బట్టబయలు చేస్తామని ప్రకటించారు. రెసిడెన్షియల్ జోన్‌ను ఇండస్ట్రీయల్ జోన్‌గా చూపుతూ సర్వే నంబర్ నంబర్ 137లో ఫేక్ ఎల్‌ఆర్‌ఎస్‌తో లగిశెట్టి శ్రీనివాసులు అనే యజమానితో రూ. 20లక్షలు తీసుకొని అనుమతి ఇచ్చారని, ఆ అనుమతిని ఉన్నతాధికారులు రద్దు చేసిన మున్సిపాలిటీకి కనువిప్పు కలగడం లేదని ఎద్దేవా చేశారు. దీనికి సంబంధించిన ఆధారాలను మీడియా చూయించారు. చందాపూర్ రోడ్డులో అనుమతి లేని లేఔట్‌కు అనుమతి ఉందని చూపుతూ ఒక్కొక్కదానికి రూ. 30వేలు వసూలు చేసి ప్రభుత్వానికి చెల్లించాల్సిన 7 ప్లాట్లకు కలిసి రూ. 14లక్షల ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టారని మండిపడ్డారు. విజయ ఆయిల్ ఫామ్‌ను నిరుద్యోగులకు ఇవ్వకుండా 30ఏళ్ల బినామీలతో లీజుకు తీసుకోవడం ఏంటని దుయ్యబట్టారు.

ఎమ్మెల్యే విమర్శిస్తే ఊరుకోం

కాంగ్రెస్ అసెంబ్లీ సమన్వయ కర్త లక్కాకుల సతీష్ మాట్లాడుతూ మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్ నెల జీతంతో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నాడని, ఇందుకు సంబంధించిన ఆధారాలు తనతో ఉన్నాయని చెప్పారు. తాము కాంగ్రెస్ గేట్లు తెరిస్తే చైర్మన్ పదవి ఊడిపోతుందని హెచ్చరించారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి గతంలో ఓ కాంట్రాక్టర్‌గా చేయాల్సిన పనులు చేశారని, తప్పులు జరిగితే అప్పుడు ఏం చేశారని, తప్పులు చేసిందే మీ పార్టీ అని తూర్పారబట్టారు. మరోసారి ఎమ్మెలే మేఘారెడ్డిని విమర్శిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని హెచ్చరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వెంకటేష్, జయసుధ, లక్ష్మి, చీర్ల సత్యం, విభూది నారాయణ, ఖైరూన్సీ బేగం, నాయకులు మధుగౌడ్, రవి, బొంబాయి మన్యంకొండ, ఎల్లన్న, రఘుయాదవ్, లతీఫ్, అస్లాం, చుక్కరాజు, దేవేందర్, ఆర్‌బీ రవిసాగర్ పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ



హీర్లతండాలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

ఖిల్లాఘనపురం: నర్సరీల్లో మొక్కల పెంపకంపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీఓ విజయ్‌కుమార్ సూచించారు. మంగళవారం గట్టుకాడిపల్లి, హీర్లతండాల్లో పర్యటించిన ఆయన నర్సరీలను, కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'వికసిత్ భారత్ సంకల్పయాత్ర' కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చి దిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను అర్హులైన వారికి అందించడంతో పాటుగా పథకాలను పొందిన లబ్ధిదారుల అభిప్రాయాలను తెలుసుకోవడానికి గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని నర్సరీల్లో బ్యాగ్ ఫిల్లింగ్ పనులు పూర్తి చేశామని పేర్కొన్నారు. విత్తనాలు నాటే పనులు చేపడతామన్నారు.

కొల్లాపూర్ డీఎంగా ఉమాశంకర్

కొల్లాపూర్: పట్టణంలో ఆర్టీసీ బస్‌డిపో మేనేజర్‌గా ఎస్ ఉమాశంకర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. బస్‌భవన్ నుంచి ఆయన బదిలీపై వచ్చారు. కొల్లాపూర్ డీఎంగా పనిచేస్తున్న రాజేశ్వర్ బస్‌భవన్‌కు బదిలీపై వెళ్లారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య



కేతేపల్లిలో..



పిన్నంచర్లలో సర్వే నిర్వహిస్తున్న సీఆర్పీ సౌమ్యరాణి



జమ్మాపూర్‌లో..

ఆత్మకూర్: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందిస్తున్నామని, బడి మధ్యలో మానేసిన పిల్లలను పనులకు కాకుండా బడులకు పంపాలని ఎంఈఓ భాస్కర్‌సింగ్ అన్నారు. మంగళవారం ఆత్మకూర్ మండలంలోని పిన్నంచర్ల, బాలకిష్టాపూర్ గ్రామాల్లో బడి బయట పిల్లల సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా సీఆర్పీ సౌమ్యరాణి ఇంటింటికీ వెళ్లి చిన్నారుల వివరాలను సేకరించారు. చదువు ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెంచేలా బోధన

పాన్‌గల్: ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థుల సామర్థ్యాలు పెంచేలా బోధన చేయాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని జమ్మాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం, విద్యార్థుల సామర్థ్యాలు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా తరగతుల వారీగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తే విద్యార్థులు చదవడం, చక్కగా సమాధానాలు చెప్పడంతో ఎంఈఓ సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనాన్ని హెచ్‌ఎంలు ప్రతి నిత్యం పరిశీలిస్తూ మెనూ ప్రకారం నాణ్యతగా అందేలా చూడాలన్నారు. హెచ్‌ఎం వీరశేఖరాచారి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను పాఠశాలకు పంపించాలి

బడిఈడు కలిగిన పిల్లలను పనులకు కాకుండా బడులకు పంపించాలని మండల సీఆర్పీలు తల్లిదండ్రులకు సూచించారు. మండలంలోని కేతేపల్లిలో బడి మానేసి ఇంటి పనులు చేస్తున్న విద్యార్థుల వివరాలను తెలుసుకొని మంగళవారం వారి ఇళ్లకు వెళ్లి విద్య యొక్క ప్రాధాన్యత వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం, మెరుగైన విద్య అందిస్తున్నట్లు తల్లిదండ్రులకు తెలిపారు. విద్యార్థులను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపించి ప్రభుత్వ బడుల బలోపేతానికి తోడ్పాటునందించాలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు గోవింద్‌నాయక్, రమాదేవి, భార్గవి పాల్గొన్నారు.